ఇంజనీరింగ్ ఫీజులు 25% పెంపు?

హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: ఇంజనీరింగ్ వార్షిక ఫీజులను ఖరారు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. జులై తొలివారంలో ఇంజనీరింగ్ తొలి విడత ప్రవేశాలకు శ్రీకారం చుట్టాలని ఉన్నత విద్యా మండలి ప్రతిపాదించి అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. మరో నాలుగైదు రోజుల్లో ప్రవేశాల నోటిఫికేషన్‌ను వెలువరించేందుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో ఫీజులను నిర్ధారించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఫీజులను భారీగా పెంచకుండా కేవలం 25 నుంచి 30 శాతం హెచ్చించే అవకాశం ఉంది. కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేసే ఇంజనీరింగ్ ప్రవేశాల కనీస ఫీజు రూ.50 వేలు.. గరిష్ఠంగా లక్షన్నర మించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ ఉన్నతాధికారులను ఆదేశించినట్టు తెలుస్తోంది. విద్యాశాఖపై మూడు రోజుల క్రితం బంజారా హిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన సందర్భంగా ఇంజనీరింగ్ వార్షిక ఫీజుల అంశం ప్రస్తావనకు వచ్చింది.

ఆ ప్రతిపాదనలపై ఆగ్రహం

నిబంధనల ప్రకారం ప్రతీ మూడేళ్లకు ఇంజనీరింగ్‌తోపాటు ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, ఫార్మసీలాంటి వృత్తి విద్యా కోర్సుల ఫీజులను సమీక్షించి పెంచాల్సి ఉంటుంది. 2025-2028 విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజులపై ఫీజుల నియంత్రణ కమిటీ ప్రతిపాదనలను సిద్ధం చేసి తుది ఆమోదానికి ప్రభుత్వానికి పంపింది. ఇందులో అధికశాతం కళాశాలల్లో ఫీజులను భారీగా పెంచాలని సిఫారసు చేసినట్టు సమాచారం. పెంచాల్సిన ఫీజులకు సంబంధించి టీఏఎఫ్‌ఆర్సీ తమ ప్రతిపాదనలను ఉన్నత విద్యా మండలికి అందజేసింది. ఫీజులను ఖరారు చేసేందుకు మండలి కార్యాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉన్నత విద్యా మండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టా రెడ్డి ఇటీవల సమావేశమై సమాలోచనలు జరిపారు. టీఏఎఫ్‌ఆర్సీ ప్రతిపాదించిన ఫీజులను ఇద్దరు మహిళా అధికారులు తిరస్కరించి ఇంతగా ఫీజులను పెంచుతూ ప్రతిపాదించడం ఏమిటని మండిపడినట్లు సమాచారం. సాంకేతిక విద్యా కళాశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మౌలిక వసతులు, అధ్యాపకుల నియామకాలు, వసతి సౌకర్యాలను పరిగణలోకి తీసుకుని గరిష్ఠంగా 30 శాతం అటు ఇటుగా ఫీజులను పెంచాలని వారు చెప్పినట్టు సమాచారం. ఇంజనీరింగ్ ప్రవేశాల్లో జాప్యం జరిగినా ఇబ్బందేమీ లేదని, విద్యార్థులపై భారం మాత్రం పడవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించడంతో ఫీజుల పెంపుపై టీఏఎఫ్‌ఆర్సీ మళ్లీ కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. జులై మొదటి వారంలో ఇంజనీరింగ్ ప్రవేశాల ప్రక్రియ మొదలవుతున్నందున ఈలోపే ఫీజులను నిర్ధారించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతితో ఉత్తర్వులు విడుదల చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది.

రాష్ట్రంలో 175 ఇంజనీరింగ్ కాలేజీలుండగా.. వాటిలో 19 యూనివర్శిటీ, ప్రభుత్వ కాలేజీలు కాగా, 154 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. 160 కాలేజీల యాజమాన్యాలు ఫీజులను పెంచాలని టీఏఎఫ్‌ఆర్సీకి దరఖాస్తు చేసుకున్నాయి. కొన్ని కాలేజీలైతే ఏకంగా 50 నుంచి 80 శాతం ఫీజు పెంపునకు అనుమతి ఇవ్వాలని కోరినట్టు సమాచారం. హైదరాబాద్ గండిపేట ప్రాంతంలో ఉన్న ఓ కళాశాల యాజమాన్యంతో పాటు మరో 5 కాలేజీలు వార్షిక ఫీజును రూ.2 లక్షలకు మించి పెంచాలని కోరాయని చెబుతున్నారు. రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు ఫీజులను పెంచాలని కోరుతున్న కళాశాలల సంఖ్య 65 ఉన్నాయని సమాచారం. ప్రస్తుతం తెలంగాణలోని 40 ఇంజనీరింగ్ కళాశాలల్లో లక్ష రూపాయల ఫీజు ఉంది.

30 శాతం మించకుండా కసరత్తు

- తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రతిపాదన
- కనిష్ఠ ఫీజు రూ.50 వేలు.. గరిష్ఠ ఫీజు లక్షన్నర?
- అంతకంటే పెంపునకు సీఎం విముఖత
- నాలుగైదు రోజుల్లో ఖరారు
- జులై తొలివారంలో ఇంజనీరింగ్ తొలివిడత ప్రవేశాలు

భారీగా పెంచొద్దు

ఇబ్బడి ముబ్బడిగా ఫీజులను పెంచుతూ అడ్మిషన్లు, ఫీజుల నిర్ధారణ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ) తీసుకున్న నిర్ణయంపై ఆయన ఒకింత అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఇష్టారా జ్యంగా ఫీజులను పెంచడమేంటి? అనేక ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇప్పటికే ఫీజులు భారీగా ఉన్నాయి. మెరిట్ విద్యార్థులు ఎంట్రన్స్‌లో మంచి ర్యాంకులు సాధించినా కన్వీనర్ కోటాలో టాప్ కళాశాలల్లో ప్రవేశాలు లభిస్తే ఆ కళాశాలల్లో నిర్ధారించిన ఫీజును చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇంకా ఫీజులను పెంచాలని చూడడం సబబు కాదు అంటూ సీఎం వ్యాఖ్యానించినట్టు చెబుతున్నారు. ఒక ప్రణాళిక ప్రకారం ఫీజులు పెంచేందుకు కసరత్తు చేయాలే తప్ప పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను దూరం చేసేలా లక్షలకు లక్షలు ఫీజులను పెంచేలా ప్రతిపాదనలు చేయడమేంటని ఆయన అన్నట్టు సమాచారం. దీంతో టీఏఎఫ్‌ఆర్సీ ప్రతిపాదించిన ఫీజులను సమీక్షించి తాజాగా రుసుములను నిర్ధారించేందుకు విద్యాశాఖ రంగంలోకి దిగాలని నిర్ణయించినట్టు సమాచారం. సగానికి పైగా ప్రయివేట్ కళాశాలల్లో ఏటా లక్షకు పైగా, ఆరేడు కళాశాలల్లో రెండు లక్షలకు పైగా ఫీజులను ప్రతిపాదిస్తూ టీఏఎఫ్‌ఆర్సీ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు.

ఆచార్యుల నియామకాలేవీ?

- 12 ప్రభుత్వ వర్సిటీల్లో 2,125 పోస్టులు ఖాళీ
- భర్తీకి మార్గదర్శకాలు ఇచ్చి రెండు నెలలైనా.. ఒక్క అడుగూ పడని పరిస్థితి
- న్యాక్ గ్రేడ్‌పై ప్రభావం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 12 విశ్వవిద్యాలయాల్లో 74 శాతం బోధన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 12-13 సంవత్సరాలుగా నియామకాలు జరగలేదు. ఈ పరిస్థితుల్లో ఆచార్యుల నియామకానికి రెండు నెలల క్రితం (ఏప్రిల్ 4న) మార్గదర్శకాలతో జీవో 21 జారీచేశారు. అయినా ప్రక్రియలో ఒక్క ముందడుగూ పడలేదు. ఏ కొత్త కోర్సు ప్రవేశపెట్టాలని భావించినా.. బోధన సిబ్బంది కొరతతో వెనకడుగు వేయాల్సి వస్తోందని వీసీలు బాహాటంగానే. జీఎన్‌టీయూహెల్‌లో ఉన్న కోర్సుల్లోనూ సీట్లకు కోత పెడుతున్నారు. అతిథి అధ్యాపకులను నియమించుకోవాలని ప్రభుత్వం చెబుతున్నా... 'న్యాక్ గ్రేడ్' కేటాయింపులో వారిని పరిగణనలోకి తీసుకోకపోతుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

పడవీ విరమణలు లేవనేనా?

ఆచార్యుల పడవీ విరమణ వయసును 60 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ.. జనవరి 30న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మరోవైపు జీవో 21 జారీ అయ్యాక తమ ఉద్యోగ భద్రత ఏమిటని కాంట్రాక్టు సహాయ ఆచార్యులు ఆందోళనకు దిగారు. కొందరు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తమ ఉద్యోగ భద్రతపై విన్నవించగా... నిబంధనల ప్రకారం ఉద్యోగాల క్రమబద్ధీకరణ సాధ్యం కాదని, కాంట్రాక్టు సిబ్బంది ఉద్యోగ భద్రతకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు వారు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వద్ద జరిగిన సమావేశంలోనూ.. కాంట్రాక్టు సహాయ ఆచార్యులను కొలువుల నుంచి తొలగించకుండా కొత్త నియామకాలు చేపట్టాలని ఆయన స్పష్టంచేశారు. ఈ క్రమంలో వారికి మరికొన్ని ఆదనపు ప్రయోజనాలు కల్పించేలా ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. తొలుత దానిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యుల నియామకాలు జరపాలంటే పూర్తిస్థాయి పాలకమండళ్ల (తసీ) ఏర్పాటు తప్పనిసరి. ప్రస్తుతం ఒక్క కాకతీయ వర్సిటీకి మాత్రమే పూర్తిస్థాయి తసీ ఉంది. ఈ అంశాలు పరిష్కరించాల్సి ఉండటం.. దానికితోడు పడవీ విరమణలు ఉండవనే భావనతో నియామక ప్రక్రియలో వేగం తగ్గిందని భావిస్తున్నారు. అయితే వర్సిటీల పరిధిలో కొత్త కళాశాలలు రావడంతో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది.

2024 డిసెంబరు 31 నాటికి వర్సిటీల్లో పరిస్థితి...

మొత్తం మంజూరు పోస్టులు:	2,878
పనిచేస్తున్న వారు:	753 (26.16%)
ఖాళీలు:	2,125 (73.86%)
పని చేస్తున్న కాంట్రాక్టు సహాయ ఆచార్యులు:	869

ఇంజనీరింగ్ ఫీజులపై గందరగోళం

కాలేజీలను తనిఖీ చేయని టీఏఎఫ్ఆర్సీ.. మేనేజ్‌మెంట్లు ఇచ్చిన లెక్కల ఆధారంగానే ఫీజులకు ఓకే!

చాలా కాలేజీల్లో రూ. లక్షకు పైనే ఫీజులు?

నాలుగిట్లో అయితే ఏకంగా రూ. 2లక్షలదుపైనే..!

ప్రతిపాదనలు రెడీ చేసిన టీఏఎఫ్ఆర్సీ.. వెల్లువెత్తుతున్న ఆరోపణలు

8 రోజుల్లోనే 157 కాలేజీల హియరింగ్ పూర్తి

యాజమాన్యాలు ఇచ్చిన లెక్కలనూ క్రాస్ చెక్ చేసిందీ లేదు!

మళ్లీ ప్రతిపాదనలు రెడీ చేయాలని సర్కార్ ఆదేశం

సీఎం పీలయస్

హైదరాబాద్, తెలంగాణ:

రాష్ట్రంలో ఇంజనీరింగ్ ఫీజుల భారంపై గందరగోళం నెలకొంది. రాబోయే మూడేళ్లలో ప్రైవేటు కాలేజీల్లో ఫీజుల నిర్ధారణ కోసం తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) వ్యవహారంలో తీసుకొచ్చిన నిబంధనల పెద్ద చిక్కుల్లోనే పడ్డాయి. కమిటీ కాలేజీలను తనిఖీ చేయకుండా, కేవలం యాజమాన్యాలు ఇచ్చిన లెక్కల ఆధారంగా ఫీజులకు ఓకే చెప్పడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు ఇంజనీరింగ్ కాలేజీల్లో తక్కువలో తక్కువగా 10 వేల వరకు ఫీజులు ఉండగా, పలు మూడేండ్లకు గాను టీఏఎఫ్ఆర్సీ చేసిన తాజా ప్రతిపాదనల్లో తక్కువలో తక్కువ రూ. 80 వేల వరకు ఫీజులు ఉన్నట్లు చర్చ జరుగుతున్నది. చాలా కాలేజీల్లో ఇప్పటికే లక్ష రూపాయలకు పైనే ఫీజులు ఉన్నాయని, కొన్ని కాలేజీల్లో అయితే ఏకంగా రూ. 2 లక్షలకు పైనా ఫీజులు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పెరిగిన ఫీజుల్లో 2022-23 మాత్రమే

2022-23లో టీఏఎఫ్ఆర్సీ నిర్ణయించిన ఫీజులు 2024-25 విద్యాసంవత్సరంలో అమలవుతున్నాయి. ఈ ఆగస్టులో ప్రారంభమయ్యే 2025-26 విద్యాసంవత్సరంతోపాటు 2026-27, 2027-28 సంవత్సరాలకు కూడా కాలేజీలు ఫీజులను పెంచే అవకాశం ఉంది. మరిన్ని పేజీ 2లో

ఇంజనీరింగ్ ఫీజులపై గందరగోళం

(మొదటి పేజీ తరువాయి)

దీనికోసం టీఏఎఫ్ఆర్సీ ఫిబ్రవరి నుంచే కసరత్తు మొదలుపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 157 ప్రైవేటు కాలేజీల నుంచి గత రెండేండ్ల ఆదాయ వ్యయాలను పేదరించింది. ఈ క్రమంలోనే ఏ మేరకు ఫీజులు పెంచాలనే ప్రతిపాదనలనూ కాలేజీల నుంచి తీసుకున్నది. చాలా కాలేజీలు ప్రస్తుతమున్న ఫీజులను డబుల్ చేయాలని ప్రపోజల్స్ అందించాయి. ఈ క్రమంలో కాలేజీల హియరింగ్ కూడా పూర్తి చేసి, ప్రైమరీగా ఫీజులను నిర్ధారిస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వాటిలోనూ కాలేజీల్లో రూ. రెండు లక్షలకుపైగా, సగానికి పైగా కాలేజీల్లో రూ. లక్ష నుంచి లక్షన్నర దాకా ఫీజులు ఖరారు చేయాలని టీఏఎఫ్ఆర్సీ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు సమాచారం. సుంచే ఎంత ఫీజు పెంచుతామనే వివరాన్ని మాత్రం కాలేజీలకు చెప్పి.. చాట్ల దానికి అంగీకరిస్తున్నట్టు సంతకాలూ తీసుకున్నది.

8 రోజుల్లో.. 157 కాలేజీల హియరింగ్

కొత్త ఫీజుల ఖరారు కోసం టీఏఎఫ్ఆర్సీ నిర్వహించిన కాలేజీల హియరింగ్ తూతూమంత్రంగా నిర్వహించారనే ఆరోపణలున్నాయి. కమిటీ ఆఫీసులో ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 10 వరకు ప్రైవేటు కాలేజీల హియరింగ్ నిర్వహించారు. మొత్తం 163 కాలేజీలకు షెడ్యూల్ ఇవ్వగా.. 157 కాలేజీలు అటెండ్ అయినట్టు అధికారులు తెలిపారు. కేవలం 8 రోజుల్లోనే.. కాలేజీల మేనేజ్‌మెంట్లతో సమావేశాలు.. ఫీజులపై నిర్ధారణ చేశారు. హియరింగ్ అంతా మమ అన్నట్టుగా చేశారంటూ అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. ఒక్కో కాలేజీకి 10, 15 నిమిషాల్లోనే హియరింగ్ పూర్తి చేయడంపై ఆరోపణలు మిన్నంటాయి. అయినా, విద్యాశాఖ ఉన్నతాధికారులు అప్పట్లో స్పందించలేదు.

ఇచ్చిన లెక్కల ఆధారంగానే ఫీజులు

ఇంజనీరింగ్ కాలేజీల మేనేజ్‌మెంట్ల నుంచి 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించిన కాలేజీల ఫైనాన్షియల్ ఆడిట్ రిపోర్టులను టీఏఎఫ్ఆర్సీ కోరింది. కానీ ఏ ఒక్క కాలేజీ నుంచీ ఆడిట్ రిపోర్టులు రాలేదు. ఆడిట్ రిపోర్టులు రాకుండానే, కాలేజీలు ఇచ్చిన లెక్కల ఆధారంగానే ఫీజులను టీఏఎఫ్ఆర్సీ ఖరారు చేసిందనే ఆరోపణలు ఉన్నాయి.

విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు ఇక ఇండియాలో

5 విద్యా సంస్థలకు యూజీసీ లెటర్ ఆఫ్ ఇంట్రెస్ట్ జారీ

న్యూఢిల్లీ, జూన్ 15: ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా తదితర దేశాలకు వెళుతున్న భారతీయ విద్యార్థులు ఇక విదేశాలకు వెళ్లనక్కర్లేదు. త్వరలో ప్రసిద్ధ విదేశీ యూనివర్సిటీలు భారత్ లో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. జాతీయ విద్యావిధానం-2020' అంతర్జాతీయకరణలో భాగంగా దేశంలో విదేశీ యూనివర్సిటీల ప్రవేశానికి కేంద్రం అనుమతినిచ్చింది. ఈ మేరకు సదరు విదేశీ యూనివర్సిటీలకు యూజీసీ ఆదివారం ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో అధికారికంగా లెటర్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఎల్ఓఐ) అందజేసింది. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, యూజీసీ తాత్కాలిక చైర్మన్ వినీత్ జోషి పాల్గొన్నారు. ఎల్ఓఐ అందుకున్న సంస్థల్లో వెస్టర్న్ ఆస్ట్రేలియా యూనివర్సిటీ అనుబంధ యూనివర్సిటీ ఆఫ్ యార్క్, యునైటెడ్ కింగ్‌డమ్ (బ్రిటన్)లోని యూనివర్సిటీ ఆఫ్ అబెర్డీన్, ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - ఐఐటీ (అమెరికా), యూరోపియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ -ఎల్ఈడీ (ఇటలీ) ఉన్నాయి. సదరు సంస్థలు క్యాంపస్‌లు ఏర్పాటు చేసుకుని అడ్మిషన్లు ప్రారంభించడానికి 18 నెలల సమయం పడుతుంది.